సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

- 66 వేల నివాసాల సర్వేకు ప్రణాళికలు
- 588 ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తి
- రేపటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం


లలితానగర్‌లో శిక్షణకు హాజరైన ఎన్యూమరేటర్లు

ముషీరాబాద్, నవంబర్ 4: సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడానికి జీహెఎంసీ సర్కిల్-15 అధికారులు సమాయత్తవుతున్నారు. ఈ మేరకు ఇంటింటి సర్వే చేపట్టనున్న ఎన్యూమరేటర్లకు రెండు రోజుల పాటు శిక్షణ పూర్తి చేశారు. సర్వేలోని అంశాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ పథకాలు అమలు, నిధుల కేటాయింపు జరుగుతుందని సమాచారం. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలు నమోదు చేయనుట్టు అధికారులు పేర్కొంటున్నారు. ముమ్ముందు రాష్ట్ర ప్రభుత్వ చేపట్ట బోయే వివిధ కార్యక్రమాలకు ఈ సర్వే ప్రామణికం కానుండటంతో పకడ్బందీగా చేపట్టాలని అధికార యంత్రాంగం భావిస్తుంది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈనెల 6 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లు ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సమాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, రాజకీయం, కులం 56 అంశాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. మొత్తం సర్కిల్-15 పరిధిలో ఆరు మున్సిపల్ డివిజన్లలో 66 వేల నివాసాలు ఉండగా 588 మంది ఎన్యూమరేటర్లు, 59 సూపర్‌వైజర్లు, ఒక్కో ఎన్యూమరేటర్ 150 నివాసాల వరకు సర్వే చేపట్టనున్నారు. అడిక్‌మెట్, ముషీరాబాద్, రాంనగర్, భోలక్‌పూర్, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్లలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో), ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు సర్వేలో పాల్గొనున్నారు. ఇందుకోసం రెండు రోజుల పాటు ఎన్యూమరేటర్లకు అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్, జవహర్‌నగర్ కమ్యూటీహాల్‌లో శిక్షణ ఇచ్చినట్టు డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్ ఈ సందర్భంగా వెల్లడించారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి. వాస్తవాలతో కూడిన సమాచారాన్ని వెల్లడించి సర్వే విజయవంతం కావాడానికి కృషిచేయాలి. ఇప్పటికే సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది.
- ఖాదర్ మొయినుద్దీన్, డిప్యూటీ కమిషనర్ సర్కిల్-15

ఎంసీఏ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్లు) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

సిద్ధిఖీ కమిటీ నివేదికను అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ కమిటీ ఇచ్చిన నివేదికను తక్షణమే అమలు చేయాలని విద్యార్థి నాయకుడు ధర్మారపు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి గతంలో మహాత్మాగాంధీ వర్సిటీ వీసీగా విధులు నిర్వహించి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై గత ప్రభుత్వం సిద్ధిఖీ నేతృత్వంలో కమిటీని నియమించిందని చెప్పారు. నరసింహారెడ్డి చేసిన అక్రమాలను కమిటీ నిర్ధారించిందని వివరించారు. ఆయన పెన్షన్ నిలిపివేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. అప్పటి వర్సిటీ అధికారులు దానిని అమలు కాకుండా చేశారని ఆరోపించారు. నరసింహారెడ్డి అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్, ఏసీబీ ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పెన్షన్‌ను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీవీ రంజని

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని పిలుపునిచ్చారు. అప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. హెచ్‌సీడీసీ ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు 'కెరీర్ రెడీనెస్'అనే అంశంపై ఐదు రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు. సీఎఫ్‌ఆర్‌డీ బిల్డింగ్‌లోని ఈ-క్లాస్ రూంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ప్రొఫెసర్ రంజని మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ప్లేస్‌మెంట్స్, విదేశీ విద్య అంశాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు.

నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలి

సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలను పరిశీలిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, నవంబర్ 4: సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలల భవన నిర్మాణానికి కేటాయించిన రూ.30 కోట్ల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన భవన నిర్మాణ స్థలాన్ని సోమవారం కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 1500 మంది విద్యార్థులకు ఓకే భవన సముదాయంలో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్మించాలని సంకల్పించిన అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం రూ.29.75 కోట్లు మంజూరు చేస్తూ 26/07/22న ఉతర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. అందులో భాగంగా అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. అప్పటి జీవోకు అనుగుణంగా ఈ ఏడాది మార్చి 13న బీఆర్ఓ (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్) కూడా విడుదల చేశారని చెప్పారు. నిధుల లేమి కారణంతో ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ప్రారంభించిన పనులు అర్ధాంతంగా ఆగిపోయాయని అన్నారు. విద్యా శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే నిధులను విడుదల చేయాలని పవన్‌కుమార్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు సాధం బాల్‌రాజ్ యాదవ్, జగదీష్‌గౌడ్, సునీల్‌ముదిరాజ్, శైలేందర్, అజిజ్, రవీందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకులకు కమిషన్ పెంచుతాం

చిక్కడపల్లి, నవంబర్ 4: రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలకు నిర్వాహకులకు త్వరలోనే కమిషన్ పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళా భవన్‌లో మీసేవ 14వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మీసేవల్లో మరిన్ని సర్వీసులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు కోసం మీసేవ వెల్ఫేర్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని ప్రటకించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పరంగా 108 మీసేవ కేంద్రాలుండగా, 5000లకు పైగా శాఖలు ఉన్నాయని తెలిపారు. టీజీటీఎస్ మన్నె సతీశ్‌కుమార్, మీసేవ కమిషనర్(ఈఎస్‌డీ) రవికిరణ్, తెలంగాణ మీసేవ ఫెడరేషన్ అధ్యక్షుడు భైరా శంకర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మోహీద్, సలహాదారుడు కర్ర శేఖర్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజ్, శ్రీనివాస్‌రావు, మెరుగు పవన్‌కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్ మూర్తి, మహమ్మద్ అన్వర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే సంక్షేమ పథకాలు

కంటోన్మెంట్, నవంబర్ 4: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా సీఎం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుపరుస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ రెండో వార్డు గన్‌బజార్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన 43 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలనే కృతనిశ్చయంతో ప్రజా పాలనను ప్రజల ఆశీర్వాదంతో ముందుకు తీసుకుపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో నరేశ్, శ్యామ్‌సన్ రాజు, రఫిక్, యూసఫ్ భాను, ఇస్మాయిల్, మంగలి యాదగిరి, చైర్మన్ యాదగిరి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

పారిశుధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 3: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో శుభ-స్వచ్ఛ దివాళీలో భాగంగా సోమవారం చిక్కడపల్లిలో శాఖ కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులకు స్వీట్లు, బిస్కెట్ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రహ్మకుమారీస్ సేవా కార్యక్రమాలు అభినందనీయం అని అన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్ ప్రవీణ, బ్రాహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఇన్‌చార్జి జయశ్రీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రష్మిత, విశ్వనాథ్, రాజేశ్, జీహెచ్‌ఎంసీ ఎస్ ఎస్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, నవంబర్ 4: బన్సీలాల్‌పేట్‌లోని డి-క్లాస్ మార్గంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను బండమైసమ్మ ఆలయం సమీపంలో సోమవారం కార్పొరేటర్ కె.హేమలత ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన పాత రోడ్లను తొలగించి, అంతర్గత రోడ్ల అభివృద్ధి కోసం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో రోడ్లను ఏర్పాటు చేయనున్నామని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి, బన్సీలాల్‌పేట్ సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రంగారావు, జగదీశ్, శ్రీనివాస్, బాల్‌రాజ్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి హౌస్ అరెస్ట్

నగేశ్ ముదిరాజ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

చిక్కడపల్లి, నవంబర్ 4: మాజీ సర్పంచుల సమ్మల పరిష్కారం కోసం సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నగేశ్‌ముదిరాజ్‌ను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. నగేశ్ మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ అరుణకు జాతీయ సాహిత్య కవితా పురస్కారం

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కోదాటి అరుణ

చిక్కడపల్లి, నవంబర్ 4: అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారాల ప్రదానం జరిగింది. కవయిత్రి డాక్టర్ కోదాటి అరుణకు జాతీయ సాహిత్య కవితా పురస్కారం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ అరిగపూడి విజయ్‌కుమార్, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ పురస్కారాన్ని అందజేశారు.

ఓయూ యూజీసీ డీన్‌గా ప్రొఫెసర్ లావణ్య

ఓయూ వీసీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ప్రొఫెసర్ బి.లావణ్య

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ఓయూ డెవలప్‌మెంట్, యూజీసీ ఎఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ బి.లావణ్య నియమితులయ్యారు. ఆమెకు ఓయూ వీసీ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. హిస్టరీ విభాగానికి చెందిన లావణ్య ప్రస్తుతం విభాగం హెడ్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా పనిచేస్తున్నారు. ఆమె గతంలో హిస్టరీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్, లేడీస్ హాస్టల్ డైరెక్టర్, జనరల్ వార్డెన్, మెస్ వార్డెన్, యూజీసీ-హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్ఆర్‌డీసీ) అసోసియేట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్డీ తరువాత ముఖ్యమైన అతి కొద్ది పదవుల్లో యూజీసీ ఎఫైర్స్ డీన్ ఒకటి. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు అభినందించారు.

రైలుకింద వ్యక్తి పడి ఆత్మహత్య

మారేడ్‌పల్లి: రైలు కింద వ్యక్తి పడి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇ.వెంకటేశ్ (45) పెయింటర్. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసై తన తండ్రి విశ్రాంత ఉద్యోగితో నిత్యం గొడవ పడేవాడు. భర్త మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో భార్య సుచిత్ర తన ఇద్దరు పిల్లలతో కలిసి కోఠీ బడిచౌడిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 3న రాత్రి 9 గంటల వరకు అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. నేను చనిపోతున్నాను అంటూ ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. లాలాగూడ-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తార్నాకలో యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు

తాజా కిచెన్ వద్ద వదిలివేసిన ఫుట్‌పాత్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: తార్నాక రహదారిపై ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. చిరువ్యాపారులపై ప్రతాపం చూపుతున్న అధికారులు మధ్యలో ఒక హోటల్‌ను మినహాయించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తార్నాకలోని 'తాజా కిచెన్' హోటల్‌ను ప్రత్యేక హోదాతో ఎందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడిసెలు కూలగొట్టి భవంతుల జోలికి వెళ్లకుండా హైడ్రా వ్యవహరించిన తీరుగానే అధికారుల తీరు ఉన్నదని దుయ్యబడుతున్నారు. ప్రభుత్వంలో పేదోడికి జీవించే హక్కు లేనట్టుగానే ప్రభుత్వ పెద్దల దగ్గర నుంచి అధికారుల వరకు అందరూ ప్రవర్తిస్తున్నారని మండిపడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వారిపై ప్రతాపం చూపుతున్న అధికారులు హోటల్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే హోటల్ యాజమాన్యం ఫుట్‌పాత్‌ను ఆక్రమించి, పార్కింగ్‌కు వినియోగిస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తార్నాక ఫ్లైఓవర్ కింద ఉన్న జంక్షన్‌ను దాదాపు ఎనిమిదేళ్ల క్రితం అధికారులు మూసివేశారు. ఇటీవల దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జంక్షన్‌ను తెరవాల్సిందిగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికుమార్ ఇతర అధికారులతో కలిసి జంక్షన్ పరిసరాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్‌ను కాస్త కుదించి, బస్‌స్టాప్‌లు మార్చి సిగ్నల్ తెరవాలని నిర్ణయించారు. దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. తార్నాక నుంచి లాలాపేట వరకు ఇరువైపులా అనేక ఆక్రమణలు, వివిధ పండ్ల దుకాణాలు, ఇతర వ్యాపారాలను తొలగించారు. కానీ మధ్యలో తాజా కిచెన్‌ను వదిలివేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అందరినీ ఒకేలా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేస్తున్నారు.

మధురోహలు కవిత సమీక్ష సమావేశం

ముషీరాబాద్, నవంబర్ 4: రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ కవి, రసమయి అధ్యక్షుడు డాక్టర్ ఎంకే రాము రచించిన మధురోహలు కవిత సమీక్ష జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆచార్య టి.గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.నరసింహప్ప, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, బైసా దేవదాసు, జె.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా ప్రొఫెసర్ అరుణజ్యోతి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా ప్రొఫెసర్ అరుణజ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన ఆమె గతంలో విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

మహిళా విశ్వవిద్యాలయ వీసీకి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సూర్యాధనుంజయను ఓయూ ఉద్యోగ సంఘం నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఓయూ ఎస్సీ, ఎస్టీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బోయ కుమార్, ప్రధాన కార్యదర్శి జుమ్‌లాల్ ఆధ్వర్యంలో వీసీని కలిసి అభినందించారు. వర్సిటీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

టాయిలెట్ల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: మానవ వనరుల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల కమిటీలు, యావత్ సమాజం భాగస్వాములవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ బాగున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా చదువుకోగలరని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణపై నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలకు ఆయన టాయిలెట్ క్లీనింగ్ మిషన్, కుర్చీలు, బల్లలను సోమవారం పంపిణీ చేశారు. సీఎస్ఆర్‌లో భాగంగా అటల్ బిహారీ వాజపేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తరపున మిషన్లను అందజేశారు. ఓయూ క్యాంపస్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈనెల 18న నగరంలో ప్రభుత్వ పాఠశాలలపై 'దిశ' సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఎండీ మాధవరావు, కార్పొరేటర్ సామల హేమ, విద్యాశాఖ అధికారులు, బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, రవిప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

సికింద్రాబాద్: నేడు నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకుడు ఎండీ ఉమర్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10:30గంటలకు ధర్నా ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగి అదృశ్యం

ఇసాక్ దేవదానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ఇంటి నుంచి వెళ్లిన విశ్రాంత రైల్వే ఉద్యోగి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పార్సిగుట్టలోని వైఎస్ఆర్ పార్కు సమీపంలో నివాసముండే ఆకెపోగు ఇసాక్ దేవదానం (84) రైల్వేలో పనిచేసి రిటైరయ్యారు. 2020లో ఇసాక్ భార్య మృతి చెందింది. అప్పటి నుంచి చిన్న కూతురు బీనా (40)తో ఉంటున్నాడు. ఈనెల 1న సాయంత్రం బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో తండ్రి ఇంటికి రాలేదని గమనించిన బీనా తన పెద్దన్న దేవదానం డేవిడ్‌కు తెలిపింది. ఇసాక్ ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, స్నేహితులను వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు అదృశ్యం

అడ్డగుట్ట, నవంబర్ 4: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం తుకారాంగేట్ మరాఠాబస్తీ ప్రాంతానికి చెందిన లండన్ ఆశాబాయి(65) తన కొడుకు గబ్బర్‌తో కలిసి భిక్షాటన చేస్తోంది. అక్టోబర్ 15న సుమారు 7 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఆశాబాయి తిరిగి రాలేదు. గతంలో కూడా మూడేండ్ల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లి కొంతకాలానికి తిరిగి వచ్చింది. అయితే ఆమె తిరిగి రాకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్లలో వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో చేసేదేమి లేక సోమవారం తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.